KANCHARLA
మనసులో మాట
నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక
తెలంగాణ
హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ
నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం
ఆదివారం 24 మే 2026


# హైదరాబాద్‌లో ఎన్టీఆర్ నిలువెత్తు విగ్రహం!

- మైత్రీవనం కూడలిలో సర్వాంగ సుందరంగా ఏర్పాట్లు
- మే 28న జయంతి సందర్భంగా ఆవిష్కరించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

02



# సర్కారు బడులకు కార్పొరేట్ చేయూత!

## విద్యాశాఖతో మూడు సంస్థల కీలక ఒప్పందాలు

- రాంకీ, రహేజా, యశోద సంస్థల భారీ నిధులు
- జవహర్ నగర్, తుక్కుగూడ స్కూళ్ల ఆధునీకరణ
- కొండాపూర్, ఉప్పల్ బడులలో వసతుల కల్పన
- కార్పొరేట్ ల సేవలను అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి



రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, విద్యా రంగ అభివృద్ధి కోసం ప్రముఖ కార్పొరేట్ సంస్థలు భారీ సాయంతో ముందుకు వచ్చాయి. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి సమక్షంలో శనివారం విద్యాశాఖతో రహేజా గ్రూప్, రామ్ కీ ఫౌండేషన్, యశోద ఫౌండేషన్ ప్రతినిధులు కీలక ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.

వివరాలు 6లో..

# హెలికాప్టర్‌లోనే సీఎం రేవంత్ రెడ్డి!

పావుగంట పాటు చాపర్‌లోనే నిరీక్షణ

- యాదగిరిగుట్ట పర్యటనలో ప్రోటోకాల్ లోపం
- స్వాగతం పలికేందుకు రాని జిల్లా అధికారులు

06





# ఎండలతో అప్రమత్తం

- ప్రజల ప్రాణ రక్షణకు ప్రాధాన్యత
- వచ్చే మూడు రోజులు పెరగనున్న వడగాల్పుల తీవ్రత
- ఎండల ధాటికి ఏడు జిల్లాల్లో 16 మంది మృతి
- బాధితులకు రూ.4 లక్షల నష్టపరిహారం
- రద్దీ ప్రాంతాల్లో నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

02

# జూనియర్ కాలేజీల్లోనూ మధ్యాహ్న భోజనం!

## గోదావరి పుష్కరాలకు వెయ్యి కోట్ల నిధులు

- పేదలకు లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
- ఐదేళ్లలో ఐదు లక్షల ఉద్యోగాలే లక్ష్యం
- కరీంనగర్‌లో సాయుధ బలగాల కేంద్రాలు
- కేబినెట్ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన శనివారం సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం పలు చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉచిత మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహారం అందించడం, వచ్చే ఏడాది జరిగే గోదావరి పుష్కరాల పనులకు వెయ్యి కోట్ల రూపాయలు కేటాయించడం వంటి కీలక తీర్మానాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటితో పాటు హైదరాబాద్ మహానగర పరిధిలో అల్పాదాయ వర్గాల కోసం లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ఐదేళ్లలో ఐదు లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా నూతన లైఫ్ సైన్సెస్ పాలసీని తీసుకురావాలని మంత్రివర్గం నిర్ణయించింది.

వివరాలు 7లో..



# అంతర్జాతీయంగా పర్యాటకాన్ని తీర్చిదిద్దుతాం!

- ప్రైవేట్ భాగస్వామ్యంతో ప్రాజెక్టుల వేగవంతం
- అడ్డంకులు లేకుండా తక్షణ అనుమతులు
- కొత్త ఆవిష్కరణలు, సృజనాత్మకతకు పెద్దపీట
- పర్యాటక ప్రాంతాల్లో ఆధునిక వసతుల కల్పన
- మంత్రి జూపల్లి కృష్ణారావు

వివరాలు 5వ పేజీ..

# డ్రోన్లు, రోబోల వినియోగం పెరగాలి

- సాగులో ఆధునిక సాంకేతికత!
- విత్తన వారోత్సవాలు ప్రారంభం
- మాయమాటలు నమ్మి మోసపోవద్దు
- పంట మార్పిడితోనే లాభాలు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

వివరాలు 3వ పేజీ..



# హైదరాబాద్‌లో ఎన్టీఆర్ నిలువెత్తు విగ్రహం!

**మైత్రీవనం కూడలిలో సర్వాంగ సుందరంగా ఏర్పాట్లు**

**మే 28న జయంతి సందర్భంగా ఆవిష్కరించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్, మే 23 (మనసులో మాట ప్రతినిధి):** తెలుగుజాతి ఖ్యాతిని దశదిశలా చాటిన విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, యుగపురుషుడు నందమూరి తారకరామారావు (ఎన్టీఆర్) జయంతిని పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వం అపూర్వ నివాళి అర్పిస్తోంది. హైదరాబాద్ నడిబొడ్డున అన్నగారి నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు సర్వాంగ సుందరంగా ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 28న ఎన్టీఆర్ జయంతి సందర్భంగా అమీర్‌పేటలోని మైత్రీవనం కూడలిలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ విగ్రహాన్ని లాంఛనంగా ఆవిష్కరించనున్నారు. రాష్ట్ర విభజన జరిగి 12 ఏళ్లు గడిచిన తర్వాత హైదరాబాద్‌లో ఏర్పాటవుతున్న తొలి ఎన్టీఆర్ విగ్రహం ఇదే కావడం విశేషం. విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు అమీర్‌పేట మైత్రీవనం కూడలికి ఇకపై 'ఎన్టీఆర్ సర్కిల్' గా నామకరణం చేయనున్నారు. ఇందుకోసం అధికారులు అన్ని రకాల ఏర్పాట్లను వేగంగా పూర్తి చేస్తున్నారు. ఈ కూడలి ప్రాంతాన్ని అందంగా తీర్చిదిద్దడంతో పాటు ప్రజలను ఆకట్టుకునేలా ప్రత్యేక లైటింగ్ సౌకర్యాలను కల్పిస్తున్నారు.

**23 అడుగుల ఎత్తులో సజీవ రూపం**

కొత్తపేటలో రూపుదిద్దుకున్న ఈ 13 అడుగుల కాంస్య విగ్రహాన్ని, కింద ఏర్పాటు చేసే పీఠంతో కలిపి మొత్తం 23 అడుగుల ఎత్తులో ఉండేలా మైత్రీవనం కూడలిలో ప్రతిష్ఠించనున్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటకు చెందిన ప్రముఖ శిల్పి, కళారత్న డి. రాజ్‌కుమార్ ఉడయార్ రెండు నెలల పాటు రాత్రింబవళ్లు శ్రమించి ఈ అద్భుత కాంస్య విగ్రహానికి సజీవ రూపాన్ని తీసుకువచ్చారు. ఎన్టీఆర్ విగ్రహ రూపకల్పనలో ఆయన చూపిన ప్రతిభను పలువురు కొనియాడుతున్నారు.

# సివిల్స్ ప్రిలిమ్స్‌కు సర్వం సిద్ధం!

**హైదరాబాద్‌లో 100 పరీక్షా కేంద్రాలు**

**హైదరాబాద్, మే 23 (మనసులో మాట ప్రతినిధి):** హైదరాబాద్‌లో మే 24న ఆదివారం నిర్వహించనున్న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి తెలిపారు. పరీక్షను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. నగరంలోని 100 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 44,209 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరుకానున్నారు. పేపర్-1 పరీక్ష ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు, పేపర్-2 పరీక్ష మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహించనున్నారు. యూపీఎస్సీ నిబంధనల ప్రకారం పరీక్ష ప్రారంభానికి 30 నిమిషాల ముందే కేంద్రాల గేట్లు మూసివేస్తారు. అభ్యర్థులు ఉదయం 9 గంటలలోపు, మధ్యాహ్నం 2 గంటలలోపు కేంద్రాలకు చేరుకోవాలి. ఆలస్యంగా వచ్చే వారికి ఎలాంటి అనుమతి ఉండదు. అభ్యర్థులు ఇ-అడ్మిట్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలి.పరీక్ష కేంద్రాల్లోకి క్యాలిక్యులేటర్లు, సెల్‌ఫోన్లు, బ్లూటూత్ పరికరాలు, స్మార్ట్‌వాచ్‌లు, పెన్‌డ్రైవ్‌లు తదితర ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదు.

# ఎండలతో అప్రమత్తంగా ఉండాలి

- ప్రజల ప్రాణ రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి!
- ఎండల ధాటికి ఏడు జిల్లాల్లో 16 మంది మృతి
- బాధితులకు తక్షణమే రూ.4 లక్షల నష్టపరిహారం
- ఉన్నతాధికారులను ఆదేశించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్, మే 23 (మనసులో మాట ప్రతినిధి):** రాష్ట్రవ్యాప్తానికి ఎండల తీవ్రత దృష్ట్యా అధికార యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరా సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. శనివారం సచివాలయంలో ఉన్నతాధికారులతో ఆయన అత్యవసర సమీక్షసమావేశం నిర్వహించారు. వచ్చే మూడు రోజుల్లో వడగాల్పుల ప్రభావం మరింత పెరగనుందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**16 మంది మృత్యువాత - రూ.4 లక్షల పరిహారం**

రాష్ట్రంలో వడదెబ్బ కారణంగా ఏడు జిల్లాల్లో 16 మంది మృతి చెందారని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నలుగురు, వరంగల్ అర్బన్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో ముగ్గురు చొప్పున, జోగులాంబ గద్వాల్, రంగారెడ్డి, సూర్యాపేట జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున మరణించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు వడదెబ్బ మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున నష్టపరిహారం అందించాలని, ఇందుకు సంబంధించిన ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

**చల్లని తాగునీరు, ఓఆర్ఎస్ పంపిణీ**

తీవ్రస్థాయి ఎల్‌నినో ప్రభావంతో వడగాల్పుల తీవ్రత పెరిగిందని, ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యానికి తావులేకుండా పనిచేయాలని స్పష్టం చేశారు. బస్ స్టాండ్లు, మార్కెట్లు, ప్రధాన రహదారులు, కార్మికులు ఎక్కువగా పనిచేసే ప్రాంతాల్లో చల్లని తాగునీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న గ్రామాలు, మండలాలను గుర్తించి ప్రజలను ముందస్తుగా చైతన్యపరచాలని చెప్పారు.

**మధ్యాహ్నం పూట బయటకు రావొద్దు**

వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసర పరిస్థితులు తప్ప బయటకు రావొద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. కూలీలు, నిర్మాణ కార్మికుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మనుషులతో పాటు పక్షులు, జంతువుల సంరక్షణ కోసం గ్రామాలు, పట్టణాల్లో నీటి తొట్టెలు, మట్టి కుండల ద్వారా తాగునీరు ఏర్పాటు చేయాలని సూచించారు.

**10 జిల్లాలకు వాతావరణ హెచ్చరిక**

ఈ నెల 26వ తేదీ వరకు కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఎండ తీవ్రత, వడగాల్పులు ఎక్కువగా ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరించిందని మంత్రి తెలిపారు. ఈ జిల్లాల కలెక్టర్లు క్షేత్రస్థాయిలో ఉంటూ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

# పాలిసెట్ ఫలితాలు విడుదల!

**82.94 శాతం ఉత్తీర్ణత నమోదు.. ఈసారి కూడా బాలికలదే పైచేయి**

**ఎంపీసీ విభాగంలో 11 మందికి టాప్ ర్యాంకులు**



**హైదరాబాద్, మే 23 (మనసులో మాట ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ నిర్వహించిన పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (పాలిసెట్)-2026 ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. డిప్లొమా ఇంజినీరింగ్ కోర్సులలో ప్రవేశానికి జరిగిన ఈ పరీక్షలో మొత్తం 82.94 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది కూడా బాలుర కంటే బాలికలే ఎక్కువ శాతంతో ముందంజలో నిలిచారు. బాలికలు 86.38 శాతం ఉత్తీర్ణత సాధించగా, బాలురు 79.92 శాతంతో సరిపెట్టుకున్నారు. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ (ఎంపీసీ) విభాగంలో మొత్తం 98,029 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కాగా, వారిలో 81,307 మంది అర్హత సాధించారు. ఈ విభాగంలో 11 మంది విద్యార్థులు మొదటి ర్యాంకులను కైవసం చేసుకున్నారు. టాపర్లుగా నిలిచిన వారిలో నామాల లోకేష్ (వరంగల్), బానోతు హేమంత్ (సూర్యాపేట), అల్వియా షిఫాలీ (మంచిర్యాల), మహ్మద్ మహబూబ్ అర్బాజ్ అలీ (ఖమ్మం), కోట్ల అపూర్వ (మహబూబ్‌నగర్), అన్నం హరి కృష్ణ (సంగారెడ్డి), జంగాల అవినాష్ గౌడ్ (నల్గొండ), చిలక నంద వరదయ్యపేటహన్ రెడ్డి (ఖమ్మం), రుద్రోజు సాజన్ (సిద్దిపేట), దూరెడ్డి వన్మయ్ రెడ్డి (నాగర్‌కర్నూల్) ఉన్నారు. మ్యాథ్స్, బయోలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ (ఎంబీపీసీ) విభాగంలో 98,029 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 79,652 మంది అర్హత సాధించారు. ఈ విభాగంలో మహబూబ్‌నగర్‌కు చెందిన కోట్ల అపూర్వ, సిద్దిపేటకు చెందిన రుద్రోజు సాజన్ సంయుక్తంగా టాప్ ర్యాంక్‌ను దక్కించుకున్నారు. అర్హత సాధించిన విద్యార్థులకు త్వరలోనే కౌన్సిలింగ్ షెడ్యూల్ ప్రకటిస్తామని అధికారులు తెలిపారు.

# స్మార్ట్ పోలీసింగ్ వైపు అడుగులు

**నేర పరిశోధన, శాంతిభద్రతలకు ప్రాధాన్యం**

**డీజీపీ కార్యాలయంలో ప్రత్యేక టెక్ టీమ్**

**హైదరాబాద్, మే 23 (మనసులో మాట ప్రతినిధి):** తెలంగాణ పోలీసు శాఖలో కృత్రిమ మేధస్సు (ఏఐ), అధునాతన సాంకేతికతల వినియోగానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు రాష్ట్ర డీజీపీ వెల్లడించారు. నేర పరిశోధన, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజా సేవల అందింపులో ఆధునిక సాంకేతికత కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. పోలీసింగ్ విధానంలో తీసుకురావాల్సిన మార్పుల కోసం డీజీపీ కార్యాలయంలో ఒక ప్రత్యేక సాంకేతిక బృందాన్ని (టెక్ టీమ్) ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఏఐ ఆధారిత పోలీసింగ్ కార్యక్రమాల అమలును వేగవంతం చేయడంతో పాటు, ప్రస్తుతం వినియోగంలో ఉన్న సీసీటీఎన్ఎస్, హెచ్ఆర్ఎంఎస్, హాక్ఐ వంటి ప్రధాన ప్లాట్‌ఫారమ్‌లను ఒకే సమగ్ర వ్యవస్థ కింద అనుసంధానం చేయడానికి వేగంగా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రజలకు మెరుగైన, పారదర్శకమైన సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని డీజీపీ చెప్పారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా స్మార్ట్, ఫాస్ట్ పోలీస్ వ్యవస్థను నిర్మించేందుకు ఉన్నతాధికారులు, సాంకేతిక బృందాలు ఎంతో కృషి చేస్తున్నాయని అభినందించారు. సాంకేతికత జోడింపుతో అటు నేరాల నియంత్రణ, ఇటు కేసుల ఛేదన మరింత సులువవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



# డ్రోన్లు, రోబోల వినియోగం పెరగాలి

- సాగులో ఆధునిక సాంకేతికత!
- విత్తన వారోత్సవాలు ప్రారంభం
- మాయమాటలు నమ్మి మోసపోవద్దు
- పంట మార్పిడితోనే లాభాలు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్, మే 23 (మనసులో మాట ప్రతినిధి):** రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గత ఏడాది స్థాపించిన సెంటర్ ఫర్ డిజిటల్ అగ్రికల్చర్, టెక్నాలజీ (సీ-డాట్) కేంద్రాన్ని సందర్శించి ఆధునిక డ్రోన్ల వినియోగంపై జరుగుతున్న పరిశోధనల వివరాలను తెలుసుకున్నారు. భవిష్యత్తులో వ్యవసాయ రంగంలో కూలీల సమస్య పెరిగే అవకాశం ఉన్నందున డ్రోన్ల వినియోగం ఎంతో కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. వర్సిటీ రూపొందించిన డ్రోన్ ఆధారిత వివిధ వ్యవసాయ విధానాలను అభినందించారు.

## రోబోటిక్స్ ప్రయోగశాల పరిశీలన

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల సహాయంతో నూతనంగా అభివృద్ధి చేసిన రోబోటిక్స్, సెన్సార్ ఆధారిత ప్రయోగశాలను మంత్రి సందర్శించారు. ఇప్పటికే కొన్ని రోబోలను వ్యవసాయ రంగంలో ఉపయోగించే విధంగా తీర్చిదిద్దినందుకు విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలను ప్రశంసించారు. అనంతరం ఉపగ్రహ ఆధారిత ల్యాబ్‌ను పరిశీలించి, తెలంగాణ ప్రభుత్వానికి అందించిన భూగణాంకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలోని రైతాంగం పరిధిలో ఉన్న మొత్తం భూమిలో సుమారు 9.3 శాతం భూమి ప్రస్తుతం సాగులో లేదని అధికారులు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు.

## విత్తన వారోత్సవాల ప్రారంభం

ప్రజా పాలన ఉ ప్రగతి ప్రణాళికలో భాగంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం తలపెట్టిన విత్తన వారోత్సవాల కార్యక్రమాన్ని మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పది మంది రైతులకు వివిధ పంటలకు చెందిన నాణ్యమైన మూల విత్తనాలను పంపిణీ చేశారు. విశ్వవిద్యాలయం ఈ కార్యక్రమం ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడం చాలా అభినందనీయమన్నారు. కొన్ని విత్తన కంపెనీల మాయమాటలకు మోసపోకుండా రైతులు ఈ నాణ్యమైన విత్తనాలను వినియోగించి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలని సూచించారు.

## డిమాండ్ ఉన్న పంటలనే సాగు చేయాలి

రైతులు మార్కెట్‌లో మంచి డిమాండ్, అమ్మకపు అవకాశాలు ఉన్న పంటలనే సాగు చేయాలని, క్రమం తప్పకుండా పంట మార్పిడి విధానాలను అనుసరించాలని మంత్రి కోరారు. అరవై ఏళ్ల క్రితం ఏర్పాటైన ఈ వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ ప్రధాని ఇందిరా గాంధీ సహా అనేక మంది మహానుభావుల తోడ్పాటుతో దేశంలోనే ప్రముఖ స్థానాన్ని సంపాదించుకుందని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో ఈ వర్సిటీ మరింత పురోగతి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. శాస్త్రవేత్తలు నిరంతరం రైతులతో మమేకమై వారికి కావలసిన పరిష్కారాలు, ప్రపంచవ్యాప్తంగా వస్తున్న అధునాతన సాంకేతికతలను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. సాగుకు అత్యంత కీలకమైన నాణ్యమైన విత్తనాలను రైతాంగానికి అందించాలనే ఉద్దేశంతో గత ఏడాది నుంచి ఈ విత్తన పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టామని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి అల్దాస్ జానయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశోధన సంచాలకులు డాక్టర్ మరాఠి బలరామ్, డాక్టర్ బాలాజీ నాయక్, డాక్టర్ నీలిమ, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ జెల్లా సత్యనారాయణ, డాక్టర్ వై. చంద్రమోహన్, పలువురు శాస్త్రవేత్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఫ్యూచర్ సిటీపై కుట్రలు సహించం!

## అభివృద్ధిని అడ్డుకోవద్దు: మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్, మే 23 (మనసులో మాట ప్రతినిధి):** ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నిర్మాణాత్మక విమర్శలు చేయాలని, రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే విధంగా వినాశకర రాజకీయాలు చేయొద్దని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సీఎల్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ నాయకులు ఇంకా ఎన్నికల ఓటమి నిరాశ నుంచి బయటకు రాలేదని ఎద్దేవా చేశారు. 'భారత్ ఫ్యూచర్ సిటీ' తెలంగాణ భవిష్యత్తుకు కీలక ప్రాజెక్ట్ అని, దాన్ని రద్దు చేస్తామంటూ హరీష్ రావు చేసిన వ్యాఖ్యలు పెట్టుబడిదారుల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాయని మంత్రి మండిపడ్డారు. ఇలాంటి బాధ్యతారహిత ప్రకటనలతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీయడం తెలంగాణకు ద్రోహం చేయడమేనని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం మారినప్పుడల్లా ప్రాజెక్టులను రద్దు చేస్తే అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్, ఓఆర్ఆర్, హైటెక్ సిటీ వంటి ప్రాజెక్టులను ఉదాహరణగా చూపిస్తూ, గత ప్రభుత్వాలు ప్రారంభించిన అభివృద్ధి కార్యక్రమాలను తర్వాతి ప్రభుత్వాలు కొనసాగించాయని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రపంచం ఏఐ యుగంలోకి అడుగుపెడుతోందని, భవిష్యత్తు తరాలకు ఉపాధి అవకాశాలు కల్పించాలంటే 'భారత్ ఫ్యూచర్ సిటీ' వంటి ప్రాజెక్టులు అవసరమని పేర్కొన్నారు. బెంగళూరు, చెన్నై వంటి నగరాలు వేగంగా ముందుకెళ్తున్న సమయంలో తెలంగాణ కూడా సమయానుకూలంగా మారాలని పిలుపునిచ్చారు. ఫార్మా సిటీని రద్దు చేయడం లేదని ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసిందని, అక్కడ 'లైఫ్ సైన్సెస్ పార్క్'ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కాలుష్యరహిత 'గ్రీన్ ఫార్మా' పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# భగీరథ్ కస్టడీ కోరిన పోలీసులు!

- పోక్సో కోర్టు నిర్ణయంపై ఉత్కంఠ
- ఈనెల 26న పిటిషన్‌పై విచారణ
- చర్లపల్లి జైలులో నిందితుడి రిమాండ్
- సిమ్ కార్డు మాయంపై పోలీసుల దర్యాప్తు
- ఆధారాల ధ్వంసంపై అదనపు సెక్షన్లు



**హైదరాబాద్, మే 23 (మనసులో మాట ప్రతినిధి):** తెలంగాణలో సంచలనం సృష్టించిన బండి భగీరథ్ పోక్సో కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. మైనర్ బాలికపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న భగీరథ్‌ను కస్టడీలోకి తీసుకుని విచారించేందుకు పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. మల్కాజ్‌గిరి పోక్సో ప్రత్యేక కోర్టు ఈ పిటిషన్‌పై విచారణను మే 26వ తేదీకి వాయిదా వేసింది.

## లోతైన విచారణకు కస్టడీ అవసరం

ప్రస్తుతం చర్లపల్లి జైలులో రిమాండ్‌లో ఉన్న భగీరథ్‌ను విచారించాల్సి ఉందని పోలీసులు కోర్టుకు తెలిపారు. కేసులో మరిన్ని ఆధారాలు సేకరించడానికి, సాక్షులను వివరంగా ప్రశ్నించడానికి, సాంకేతిక ఆధారాలను పరిశీలించడానికి నిందితుడి కస్టడీ ఎంతో కీలకమని విజ్ఞప్తి చేశారు. కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఇప్పటికే బాధితురాలితో పాటు ఆమె తల్లిని విచారించి సమాచారం సేకరించింది. భగీరథ్ కు చెందిన 10 మంది స్నేహితులను కూడా విచారించి వివరాలు రాబట్టింది.

## ఆధారాల ధ్వంసంపై అదనపు సెక్షన్లు

నిందితుడి సెల్‌ఫోన్ పోలీసులకు లభించినప్పటికీ అందులో ఎలాంటి సాక్ష్యాలు దొరకలేదు. సిమ్ కార్డు లేకుండా ఫోన్ ఇవ్వడంతో డేటా రికవరీ కష్టంగా మారింది. సిమ్ ఎక్కడో పెట్టి మర్చిపోయానని భగీరథ్ చెప్పినప్పటికీ, ఆధారాలను ఉద్దేశపూర్వకంగా నాశనం చేశారనే అనుమానంతో పోలీసులు అదనపు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. మరోవైపు అరెస్ట్ జరిగినందున హైకోర్టులో దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను భగీరథ్ తరఫు న్యాయవాది ఉపసంహరించుకున్నారు. బాధితురాలి భద్రత, వైద్య పరీక్షలు, డిజిటల్ ఆధారాల సేకరణపై ప్రత్యేక నిఘా పెట్టిన పోలీసులు, ఈనెల 26న కోర్టు ఇచ్చే కస్టడీ నిర్ణయం కోసం వేచి చూస్తున్నారు.

# హెచ్ఐఎల్‌టీపీ పోర్టల్ ప్రారంభం!

## కాలుష్య పరిశ్రమల తరలింపునకు ఊతం

## ఆన్‌లైన్ వేదికను తెరిచిన మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్, మే 23 (మనసులో మాట ప్రతినిధి):** తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ అమలును వేగవంతం చేస్తూ ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రారంభించింది. పరిశ్రమల శాఖ జారీ చేసిన జీవో ఎంఎస్ నంబర్ 81 ప్రకారం ఈ విధానానికి సంబంధించిన మార్గదర్శకాలు అమల్లోకి వచ్చాయి. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఈ పోర్టల్‌ను లాంఛనంగా ప్రారంభించారు. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని 21 పారిశ్రామిక పార్కులు, స్వతంత్ర యూనిట్లలో ఉన్న కాలుష్యకారక పరిశ్రమల తరలింపునకు ఈ విధానం ఉపయోగపడనుంది. అర్హులైన పరిశ్రమలు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించి, వాటి స్థితిని ట్రాక్ చేసుకునే సౌకర్యం కల్పించారు. జూన్ 30, 2026 లోపు దరఖాస్తు చేసుకునే యూనిట్లకు 10 శాతం డెవలప్‌మెంట్ ఇంపాక్ట్ ఫీజు చెల్లింపు, ప్రస్తుత ఎస్ఆర్ఓ మార్కెట్ రేట్లను పరిగణనలోకి తీసుకునే అవకాశం కల్పించారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, టీజీఐఐసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. చర్లపల్లి, కుషాయిగూడ, నాచారం, బాలానగర్ పారిశ్రామిక ప్రాంతాల ప్రతినిధులు కూడా ఈ ప్రారంభోత్సవంలో భాగస్వాములయ్యారు.

# యువతకు ఉద్యోగాలతో పాటు సాధికారత!

**సికింద్రాబాద్‌లో 19వ విడత రోజ్‌గార్ మేళా**

**218 మందికి నియామక పత్రాల అందజేత**

**లబ్ధిదారులను అభినందించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

**అంకుర సంస్థలతో పెరుగుతున్న అవకాశాలు**

**వర్చువల్‌గా ప్రసంగించిన ప్రధాని నరేంద్ర మోదీ**



**హైదరాబాద్, మే 23 (మనసులో మాట ప్రతినిధి):** నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడంతో పాటు వారికి సాధికారత కల్పించే దిశగా రోజ్‌గార్ మేళా కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రూపకల్పన చేశారని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి పేర్కొన్నారు. 2022 నుంచి ఈ మేళాల ద్వారా లక్షలాది మందికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు లభించాయని చెప్పారు. దేశవ్యాప్తంగా 47 ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 19వ విడత రోజ్‌గార్ మేళా కార్యక్రమం శనివారం సికింద్రాబాద్‌లోని రైల్ కళారంగ్ వేదికగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్రమంత్రి, కొత్తగా కేంద్ర ప్రభుత్వంలోని ఆరు శాఖల్లో ఉద్యోగాలకు ఎంపికైన 218 మంది యువతీయువకులకు నియామక పత్రాలను అందజేశారు.

### ఉద్యోగ సృష్టికర్తలుగా యువత

కేంద్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీలు లేకుండా ఉద్యోగాలు భర్తీ చేస్తూ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తోందని కిషన్ రెడ్డి అన్నారు. ఇప్పుడు దేశ యువతీయువకులు ఉద్యోగార్థులుగా కాకుండా ఉద్యోగ సృష్టికర్తలుగా మారుతున్నారని ఆనందం వ్యక్తం చేశారు. అంకుర సంస్థలు సైతం లక్షలాది ఉద్యోగాలను కల్పిస్తున్నాయని, మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం ద్వారా తయారీ రంగంలోనూ పెద్దఎత్తున అవకాశాలు లభిస్తున్నాయని గుర్తుచేశారు.

### దేశ సేవకు అంకితం కావాలి

ప్రభుత్వ ఉద్యోగం లభించడం ద్వారా 20 నుండి 30 ఏళ్ల పాటు దేశానికి సేవ చేసే అవకాశం లభించినందున, దేశాభివృద్ధి కోసం, ప్రజా సంక్షేమం కోసం అంకితభావం, సేవా దృక్పథంతో పనిచేయాలని అభ్యర్థులకు మంత్రి పిలుపునిచ్చారు. తమ కోసం ఎన్నో కష్టాలు పడిన తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయవద్దని, వారికి వృద్ధాప్యంలో తోడుగా నిలవాలని సూచించారు. దేశవ్యాప్తంగా ఒకేసారి జరిగిన ఈ రోజ్‌గార్ మేళాను ఉద్దేశించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవ, ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ సిద్ధార్థ్ కటి, సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ డాక్టర్ ఆర్. గోపాలకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ నియామక పత్రాలు అందుకున్న యువత, వారి కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు.

# యువ ప్రతిభకు క్రీడా వేదిక!

- గచ్చిబౌలిలో ముగింపు వేడుకలు
- నియామక పత్రాలు, మెడల్స్ పంపిణీ
- మట్టిలో మాణిక్యాల వెలికితీతే లక్ష్యం
- క్రీడా సంస్కృతి విస్తరణకు కృషి
- తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి



**హైదరాబాద్, మే 23 (మనసులో మాట ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్ర యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహించిన యువజన క్రీడా వారోత్సవాలు విజయవంతమయ్యాయని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి పేర్కొన్నారు. గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ఆయన స్పోర్ట్స్ అథారిటీ ఎండీ, యూత్ సర్వీసెస్ కమిషనర్ డాక్టర్ ఏ. సోనీ బాలాదేవితో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

### నియామక పత్రాలు, బహుమతుల ప్రదానం

ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన జాబ్ మేళాల్లో ఎంపికైన యువతకు ఈ వేదికపై నియామక పత్రాలను అందజేశారు. అలాగే స్పోర్ట్స్ డే పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు మెడల్స్, ట్రోఫీలు ప్రదానం చేశారు. ఆరు రోజుల పాటు నిర్వహించిన వివిధ క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలు అందజేసి, భాగస్వామ్య సంస్థల ప్రతినిధులను ఘనంగా సన్మానించారు.

### లక్ష్య సాధనలో ప్రజా పాలన

ఈ సందర్భంగా చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ మట్టిలో మాణిక్యాల్లాంటి ప్రతిభావంతులు ఉన్నారని, వారిని వెలికితీసి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రజా పాలన ఉ ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ వారోత్సవాలు ప్రత్యేక గుర్తింపు సాధించాయని చెప్పారు. అధికారుల సమిష్టి సమన్వయం వల్లే ఈ విజయం సాధ్యమైందని ప్రశంసించారు.

### గ్రామీణ స్థాయికి క్రీడా సంస్కృతి


స్పోర్ట్స్ అథారిటీ ఎండీ డాక్టర్ సోనీ బాలాదేవి మాట్లాడుతూ, మే 1 నుంచి 11 వరకు జిల్లా కేంద్రాల్లో జాబ్ మేళాలు నిర్వహించామన్నారు. మే 18 నుంచి 23 వరకు ప్రతి రోజూ ప్రత్యేక కాన్సెప్ట్‌తో నిర్వహించిన కార్యక్రమాల్లో యువకులు, క్రీడాకారులు, తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. క్రీడలు, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి రంగాలలో యువతను తీర్చిదిద్దేందుకు వివిధ ప్రభుత్వ శాఖలు సమిష్టిగా సహకరించాయని వివరించారు. ఈ ముగింపు వేడుకల్లో యువజన సేవల శాఖ జాయింట్ డైరెక్టర్ వేణుగోపాల్, స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ భాషా, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి మల్లారెడ్డి, డీట్ డైరెక్టర్ రాజేశ్వర్ రెడ్డి, టాస్క్ సీఈవో నితిన్ రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన యువత, విద్యార్థుల నుంచి లభించిన విశేష స్పందనతో ఈ కార్యక్రమం గ్రామీణ స్థాయి వరకు క్రీడా సంస్కృతిని విస్తరింపజేసిందని నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేశారు.

# దేశ ఆర్థిక ప్రగతిలో సీఏల పాత్ర కీలకం!

**ఐసీఏఐ కాన్వకేషన్‌లో కేటీఆర్ వ్యాఖ్యలు**

**ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు అభినందనలు**

**హైదరాబాద్, మే 23 (మనసులో మాట ప్రతినిధి):** దేశ అభివృద్ధి, ఆర్థిక ప్రగతిలో చార్టర్డ్ అకౌంటెంట్స్ (సీఏ) పాత్ర అత్యంత ముఖ్యమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లోని అన్వయ కన్వెన్షన్‌లో జరిగిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) కాన్వకేషన్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఏ పూర్తి చేసిన విద్యార్థులకు కేటీఆర్ అభినందనలు తెలిపారు. సీఏ కావడం అంటే కేవలం పరీక్షలో ఉత్తీర్ణత సాధించడం కాదని, ఒత్తిడి, అనిశ్చితి, వైఫల్యాలను అధిగమించే పట్టుదలకు నిదర్శనమని అన్నారు. దేశంలో వ్యాపారాలు, స్టార్టప్‌లు పెరుగుతున్న నేపథ్యంలో ఆర్థిక మార్గదర్శకులుగా సీఏల అవసరం మరింత పెరుగుతుందని




కేటీఆర్ పేర్కొన్నారు. పన్నుల చెల్లింపుల్లో పారదర్శకత, జీఎస్టీ వంటి వ్యవస్థలు, ఆధునిక సాంకేతికత కారణంగా సీఏల పరిధి విస్తరిస్తోందన్నారు. సీఏలు కేవలం పన్నుల సలహాదారులు మాత్రమే కాకుండా వ్యాపారాలను బలోపేతం చేసే కీలక భాగస్వాములని తెలిపారు. వ్యాపారాలు అభివృద్ధి చెందితే ప్రభుత్వ ఆదాయం పెరిగి, సంక్షేమ కార్యక్రమాలకు బలం చేకూరుతుందని చెప్పారు. సాంకేతికత, కృత్రిమ మేధస్సు వంటి ఆధునిక సాధనాలను సీఏలు తమ వృత్తిలో సమర్థంగా వినియోగించుకోవాలని కేటీఆర్ సూచించారు. సీఏల విజయానికి తల్లిదండ్రుల త్యాగాలు పునాది అని, వారిని ఎప్పటికీ గుర్తుంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీఏఐ ప్రతినిధులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ కండువాలు కప్పుకున్న పోలీసులు!

**రాష్ట్రంలో నశించిన శాంతిభద్రతలు**

**మధు అంత్యక్రియల్లో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి**

**సూర్యాపేట, మే 24 (మనసులో మాట ప్రతినిధి):** పోలీసులు కాంగ్రెస్ కండువాలు కప్పుకొని తిరుగుతున్నారని మాజీ మంత్రి జగదీష్ రెడ్డి ధ్వజమెత్తారు. పోలీస్ స్టేషన్లు కాంగ్రెస్ పార్టీ నాయకులకు అడ్డాగా మారాయని విమర్శించారు. సూర్యాపేటలో దారుణ హత్యకు గురైన బీఆర్ఎస్ కార్యకర్త మధు అంత్యక్రియల్లో ఆయన శనివారం పాల్గొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అరాచకాలు పెరిగిపోయాయని, శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని మండిపడ్డారు. ఇప్పటివరకు జిల్లాలో ఇద్దరు బీఆర్ఎస్ కార్యకర్తలను పొట్టన పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులకు కఠిన శిక్షలు పడేంత వరకు పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు. 2018లో జరిగిన బీఆర్ఎస్ నాయకుడి హత్య కేసులో కీలక సాక్షిగా ఉన్న మధును కాంగ్రెస్ నాయకులు అనేకసార్లు బెదిరించారని జగదీష్ రెడ్డి తెలిపారు. ఓ పోలీస్ అధికారి స్వయంగా పిలిచి 'నువ్వు ఎగిరిపోతావు' అంటూ బెదిరించాడని పేర్కొన్నారు. ఈ హత్య పోలీస్ అధికారులకు తెలిసే జరిగిందని ఆరోపించారు. అందుకే మధును ముందే ఓ పోలీస్ అధికారి హెచ్చరించారని చెప్పారు. పోలీసులే బెదిరిస్తున్నారని మధు తనతో చెబితే జాగ్రత్తగా ఉండమని సూచించానని, కానీ ఏదో పంచాయితీ ఉందని పిలిపించి దారుణంగా హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరిగినా నిందితులను ఇప్పటివరకు అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. కాంగ్రెస్ గుండాల చేతిలో దారుణంగా హత్యకు గురైన మధు కుటుంబ పోషణ బాధ్యతను, అతని పిల్లల చదువుల బాధ్యతను బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా తీసుకుంటుందని జగదీష్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కేసులో ఏ అధికారి తప్పు చేసినా తాము గమనిస్తూనే ఉన్నామని హెచ్చరించారు. తాము మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత బాధ్యులైన అధికారులు ఎవరూ తప్పించుకోలేరని చెప్పారు. ఇలాంటి క్రిమినల్ కేసులు పదేళ్ల తర్వాత అయినా తిరిగి ఓపెన్ చేసి చర్యలు తీసుకున్న సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు. తప్పు చేస్తే ఐజీ, డీజీ స్థాయి అధికారులను సైతం వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు.

# పర్యాటకాన్ని అంతర్జాతీయంగా తీర్చిదిద్దుతాం!

- ప్రైవేట్ భాగస్వామ్యంతో ప్రాజెక్టుల వేగవంతం
- అడ్డంకులు లేకుండా తక్షణ అనుమతులు
- కొత్త ఆవిష్కరణలు, సృజనాత్మకతకు పెద్దపీట
- పర్యాటక ప్రాంతాల్లో ఆధునిక వసతుల కల్పన
- మంత్రి జూపల్లి కృష్ణారావు



**హైదరాబాద్, మే 23 (మనసులో మాట ప్రతినిధి):** తెలంగాణ పర్యాటక రంగాన్ని రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ప్రధాన ఇంజన్‌గా మారుస్తామని, అంతర్జాతీయ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ ప్రాంగణంలో శనివారం జరిగిన "డెస్టినేషన్ తెలంగాణ ఉ రోడ్ అహెడ్" సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన పర్యాటక వారోత్సవాల ముగింపు సందర్భంగా ఈ సదస్సును నిర్వహించారు.

## పెట్టుబడులకు ఆహ్వానం

రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం సంపూర్ణ సహకారాన్ని అందిస్తుందని, ప్రైవేట్ భాగస్వామ్యంతో ప్రాజెక్టులను వేగవంతం చేస్తామని మంత్రి తెలిపారు. ఇందుకోసం కొత్త పర్యాటక పాలసీని తీసుకువచ్చామన్నారు. పర్యాటక రంగంపై పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సరైన ప్రతిపాదనలతో వస్తే ఎలాంటి జాప్యం లేకుండా అనుమతులు ఇస్తామని హామీ ఇచ్చారు.

## లీజు పద్ధతిలో ఆస్తులు

నిరర్థకంగా ఉన్న ప్రభుత్వ ఆస్తులను పర్యాటక అవసరాల కోసం దీర్ఘకాలిక లీజు పద్ధతిలో కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి ప్రకటించారు. ఎంపిక చేసిన పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రకటనలు జారీ చేయనుందని, ఎంపికైన సంస్థల డిజైన్లు, ప్రాజెక్ట్ అంచనాల వ్యయాన్ని ప్రభుత్వమే భరిస్తుందని పేర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో కనీస అవసరాలైన తాగునీరు, రెస్ట్ రూమ్స్, వసతి గృహాలు లేవని, వాటిని అధిగమించేందుకు మొబైల్ గ్లాస్ హౌస్‌లు, కాన్వాస్ టెంట్లు వంటి ఆధునిక వసతుల ఏర్పాటుకు ప్రైవేట్ వ్యక్తులు ముందుకు రావాలని కోరారు.

## ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

పర్యాటక రంగం కేవలం వినోదం మాత్రమే కాదని, ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచే కీలక రంగమని జూపల్లి కృష్ణారావు చెప్పారు. పర్యాటక రంగం వృద్ధి చెందితేనే అనుబంధ పరిశ్రమలు లాభపడతాయని, యువతకు భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా రాష్ట్రంలో మౌలిక వసతులు కల్పిస్తామని, ఇప్పటికే భువనగిరి కోటలో రోప్‌వే వంటి ఆకర్షణలపై దృష్టి సారించామని వివరించారు.

# ఫ్యూచర్ సిటీ నిరోధం.. అక్రమాల అడ్డుకట్ట!

**రెండేళ్లలో కూల్చివేతలే మిగిలాయి**

**భూదందాల కోసమే మార్పులు**

**దేశపతి శ్రీనివాస్ మండిపాటు**

**హైదరాబాద్, మే 23 (మనసులో మాట ప్రతినిధి):** హైదరాబాద్ నగరంలో రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా కుప్పకూలిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ రెండున్నరేళ్ల కాలంలో ఇళ్లు కూల్చడమే తప్ప, ఎలాంటి అభివృద్ధి చేయలేదని ధ్వజమెత్తారు. ఫ్యూచర్ సిటీని అడ్డుకోవడం అంటే కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమ మార్గాల ప్రణాళికలను అడ్డుకోవడమేనని ఆయన స్పష్టం చేశారు. ఫార్మాసిటీని కొనసాగిస్తామని కోర్టుకు ఎందుకు చెప్పారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని దేశపతి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రైతులు తమ భూములను కేవలం ఫార్మాసిటీ కోసం మాత్రమే ఇచ్చారని గుర్తుచేశారు. అధికార పార్టీ భూదందాలు చేసుకోవడానికి రైతులు భూములు ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఫార్మాసిటీని రద్దు చేస్తే ఆ భూములను తిరిగి రైతులకు ఇచ్చేస్తామని గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పలేదా అని ప్రశ్నించారు. ప్రభుత్వ స్వార్థ ప్రయోజనాల కోసం ఫార్మాసిటీ భూములను వేరే ప్రయోజనాలకు మళ్లిస్తారా అని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న ఈ విధ్వంసాన్ని, అక్రమాలను చక్కదిద్దే బాధ్యత ప్రతిపక్షంగా తమపై ఉందని దేశపతి శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. రైతుల హక్కుల కోసం, రాష్ట్ర ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని పేర్కొన్నారు.

# దేశంలోనే తొలి ఏఐ ఫిర్యాదుల రికార్డర్!

**'ఏఐ కాప్‌రైటర్' యాప్‌ను ఆవిష్కరించిన సీపీ సజ్జనార్**

**పదికి పైగా భాషల్లో ఫిర్యాదుల నమోదుకు అవకాశం**

**మాట్లాడిన విషయాలు వెంటనే అక్షర రూపంలోకి మార్పు**

**వలస కార్మికులు, పర్యాటకులకు పెద్ద ఊరట**

**80కి పైగా పోలీస్ స్టేషన్లలో అందుబాటులోకి**

**హైదరాబాద్, మే 23 (మనసులో మాట ప్రతినిధి):** దేశంలోనే మొట్టమొదటిసారిగా కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత ఫిర్యాదుల రికార్డర్ 'ఏఐ కాప్‌రైటర్' మొబైల్ యాప్‌ను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ శనివారం ఆవిష్కరించారు. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ సాంకేతికతను పరిశీలించారు. ఈ యాప్ ద్వారా బాధితులు పదికి పైగా ప్రముఖ భారతీయ భాషల్లో తమ ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చని సీపీ తెలిపారు.



ఫిర్యాదుదారులు మాట్లాడిన విషయాలను ఈ వ్యవస్థ వెంటనే అక్షర రూపంలోకి మార్చడమే కాకుండా, పోలీసులు చదువుకోవడానికి వీలుగా అనువదిస్తుంది. నమోదైన వివరాలన్నీ స్వయంచాలకంగా పీడీఎఫ్ రూపంలో భద్రమవుతాయని, దీనివల్ల రికార్డుల ట్యాంపరింగ్‌కు అవకాశం ఉండదని స్పష్టం చేశారు. బాధితులు, నిందితులు, సాక్షుల ప్రకటనలను ఈ యాప్ విడివిడిగా గుర్తించగలగడం దీని ప్రత్యేకత. వలస కార్మికులు, పర్యాటకులు, మహిళలు, వృద్ధులకు ఈ సాంకేతికత పెద్ద ఊరటనిస్తుందని సజ్జనార్ పేర్కొన్నారు. న్యాయం అందడానికి భాష ఎన్నటికీ అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతోనే దీనిని రూపొందించినట్లు చెప్పారు. తొలిదశలో హైదరాబాద్ పరిధిలోని 80కి పైగా పోలీస్ స్టేషన్లలో ఈ యాప్‌ను అందుబాటులోకి తెస్తున్నారు. ఎఫ్ఐఆర్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయడానికి, ఖచ్చితత్వంతో కూడిన దర్యాప్తునకు ఇది ఎంతో దోహదపడుతుందని వివరించారు. బ్లూక్లౌడ్ సాఫ్టెక్ సొల్యూషన్స్ సహకారంతో సిటీ పోలీస్ ఐటీ సెల్ ఈ యాప్‌ను రూపొందించింది.

# 25 నుంచి 'రైతు గోస-బీజేపీ భరోసా'!

**రాష్ట్రవ్యాప్తంగా పోరుబాటకు బీజేపీ సిద్ధం**

**ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నిరసనలు**

**అభ్యర్థులతో ఎంపీలు, ఎమ్మెల్యేల ముఖాముఖి**



**హైదరాబాద్, మే 23 (మనసులో మాట ప్రతినిధి):** ఈ నెల 25 నుంచి 'రైతు గోస–బీజేపీ భరోసా' పేరిట రాష్ట్రవ్యాప్త పోరుబాట నిర్వహించేందుకు బీజేపీ సిద్ధమవుతోంది. తొలిరోజు తాండూరులో, రెండో రోజు గజ్వేల్, భువనగిరి, వరంగల్‌లో, మూడో రోజు భూపాలపల్లి, కాటారం, మంథని, పెద్దపల్లిలో ఈ పోరుబాట సాగనుంది. ఈ పోరుబాటలో భాగంగా రాష్ట్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పెద్ద ఎత్తున నిరసనలు తెలుపనున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఎదురవుతున్న ఇబ్బందులపై రైతులతో నేరుగా ముఖాముఖి నిర్వహించి, వారి సమస్యలను అడిగి తెలుసుకోనున్నారు. నాయకులందరూ ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనుగోలు కేంద్రాల వద్దే ఉండి క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలిస్తారు.

## అగ్రనాయకత్వం ఆధ్వర్యంలో పర్యటనలు

బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కే. లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఈ పోరుబాట కొనసాగనుంది. ఈ పర్యటనల్లో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ అభయ్ పాటిల్ కూడా స్వయంగా పాల్గొననున్నారు. అన్నదాతలకు మద్దతుగా నిలవడంతో పాటు, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# గురుకులాల కిరాణా కొనుగోళ్లలో అవినీతి!

**సీఎం రేవంత్‌కు దాసోజు శ్రవణ్ బహిరంగ లేఖ**

**కలెక్టర్ల వ్యవస్థను పక్కనబెట్టడం అవమానకరం**

**ఆఫ్రికా పప్పులతో విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం**

**స్థానిక చిన్న వ్యాపారుల గొంతు నొక్కడమే**

**ఐఏఎస్ అధికారులపై నమ్మకం లేదా?**

**హైదరాబాద్, మే 23 (మనసులో మాట ప్రతినిధి):** గురుకులాల కిరాణా కొనుగోళ్లలో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ఆరోపించారు. ఈ విషయమై ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి ఆయన ఒక బహిరంగ లేఖ రాశారు. జిల్లాల్లో కలెక్టర్ల వ్యవస్థను పక్కనబెట్టడం తీవ్ర అవమానకరమని వ్యాఖ్యానించారు. అసలు ఐఏఎస్ అధికారులపై ప్రభుత్వానికి నమ్మకం లేదా అని ప్రశ్నించారు.

## వందల కోట్ల టెండర్ల వెనుక కమిషన్లు

రూ.100 కోట్ల కమిషన్ల కోసమే మూడు నెలల టెండర్ల విధానానికి మంగళం పాడారని దాసోజు శ్రవణ్ ఆరోపించారు. ఏడాది కాలపరిమితి టెండర్లతో ప్రభుత్వ ఖజానాకు వందల కోట్ల రూపాయల గండి కొట్టేలా ప్రణాళికలు వేశారని మండిపడ్డారు. తెలంగాణ బ్రాండ్ అయిన తాండూర్ కందిపప్పును పక్కనబెట్టి, ఆఫ్రికా నుంచి తెచ్చిన నాసిరకం పప్పులతో విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.165 కోట్ల టర్నోవర్ నిబంధన పెట్టడం ద్వారా స్థానిక చిన్న వ్యాపారులు, మహిళా సంఘాల గొంతు నొక్కడమేనని విమర్శించారు. కేంద్రీకరణే మేలైనప్పుడు ప్రైవేటు కాంట్రాక్టర్లు ఎందుకని, మార్క్‌ఫెడ్ ద్వారా నేరుగా కొనుగోళ్లు చేయవచ్చు కదా అని నిలదీశారు. ప్రభుత్వ నిర్ణయాలకు తలొగ్గుతున్న అధికారులకు రాబోయే బీఆర్ఎస్ ప్రభుత్వంలో న్యాయ విచారణ తప్పదని దాసోజు శ్రవణ్ హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఇప్పటికైనా గురుకులాల కొనుగోళ్లలో పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు.

# హెలికాప్టర్‌లోనే సీఎం రేవంత్ రెడ్డి!

**యాదగిరిగుట్ట పర్యటనలో ప్రోటోకాల్ లోపం**

**స్వాగతం పలికేందుకు రాని జిల్లా అధికారులు**

**పావుగంట పాటు చాపర్‌లోనే నిరీక్షణ**

**నిర్లక్ష్యంపై సచివాలయ వర్గాల తీవ్ర ఆగ్రహం**

**బాధ్యులపై చర్యలకు ఉన్నతాధికారుల ఆదేశం**

**హైదరాబాద్, మే 23 (మనసులో మాట ప్రతినిధి):** అధికారుల నిర్లక్ష్యం కారణంగా ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, తోటి మంత్రులు సుమారు 15 నిమిషాల పాటు హెలికాప్టర్‌లోనే ఉండిపోవాల్సి వచ్చింది. యాదగిరిగుట్ట పర్యటనలో చోటుచేసుకున్న ఈ ప్రోటోకాల్ లోపం ప్రభుత్వ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. శనివారం ఉదయం యాదగిరిగుట్టలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెలికాప్టర్‌లో వెళ్లారు. పెద్దగుట్టపై చాపర్ ల్యాండ్ అయిన తర్వాత సీఎం, మంత్రులను ఆహ్వానించడానికి జిల్లా ఉన్నతాధికారులు ఎవరూ హెలిప్యాడ్ వద్దకు చేరుకోలేదు. అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగానే ఈ పరిస్థితి తలెత్తినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి వచ్చే సమయానికి కనీసం ఒక్క అధికారి కూడా స్వాగతం పలికేందుకు అందుబాటులో లేకపోవడంపై సీఎం, మంత్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక కలెక్టరేట్, పోలీస్ యంత్రాంగం నిర్లక్ష్యం వల్లే ముఖ్యమంత్రి పావుగంట పాటు చాపర్‌లోనే నిరీక్షించాల్సి వచ్చిందని సచివాలయ వర్గాలు భావిస్తున్నాయి. అత్యంత ప్రాధాన్యత కలిగిన పర్యటనలో ఇలాంటి వైఫల్యంపై సెక్రటేరియట్‌లోని భద్రతా దళాలు, ఉన్నతస్థాయి అధికారులు సంబంధిత జిల్లా అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రోటోకాల్ లోపానికి బాధ్యులైన జిల్లా అధికారులపై త్వరలోనే కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని విశ్వసనీయ సమాచారం.

# ఉమ్మడి పాలమూరులో గాలివాన బీభత్సం!

**పిడుగుపాటుకు ఒకరు, రెండు పశువులు మృతి**

**మహబూబ్‌నగర్, మే 23 (మనసులో మాట ప్రతినిధి):** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో గాలివాన బీభత్సం సృష్టించింది. పలు ప్రాంతాల్లో భారీగా ఈదురుగాలులు వీచడంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం గోవిందాయిపల్లిలో పిడుగుపాటుకు గురై మల్లయ్య అనే గొర్రెల కాపరి అక్కడికక్కడే మృతి చెందాడు. అచ్చంపేట పరిధిలో పిడుగుపడి రెండు పశువులు మరణించాయి. అచ్చంపేట, బిజినేపల్లి, తాడూరు, తెలకపల్లి మండలాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. అచ్చంపేట మార్కెట్ యార్డులో, ఐకేపీ కేంద్రాల్లో ఉన్న ధాన్యం వర్షానికి తడిసిముద్దయింది. పాలమూరు జిల్లా కేంద్రంలో దాదాపు అరగంట పాటు ఈదురుగాలులతో కూడిన వర్షం పడటంతో కలెక్టరేట్ వద్ద ఉన్న బస్టాప్ షెడ్ ఒక్కసారిగా రోడ్డుపై పడిపోయింది. బైపాస్ రోడ్డులో పలుచోట్ల చెట్లు విరిగిపడటంతో కార్లు, ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నాయి. వనపర్తి జిల్లాలో భారీగా వీచిన ఈదురుగాలులు, వడగళ్ల వాన వల్ల వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

**పిడుగుపాటుకు పశువులు మృతి**

అచ్చంపేట మండలం బుడ్డ తండాలో ఒక విషాద ఘటన చోటుచేసుకుంది. గిరిజన రైతు మోత్యకు చెందిన రెండు పశువులు పిడుగుపాటుకు గురై మరణించాయి. శనివారం సాయంత్రం అకాల వర్షం కురిసిన సమయంలో వ్యవసాయ పొలంలో చెట్టుకు కట్టేసి ఉన్న పశువులపై ఒక్కసారిగా పిడుగు పడటంతో అవి అక్కడికక్కడే ప్రాణాలు విడిచాయి. వ్యవసాయం కోసం ఇటీవలే లక్షా పదివేల రూపాయల వ్యయంతో ఆ పశువులను కొనుగోలు చేసినట్లు బాధితుడు కన్నీరుమున్నీరయ్యాడు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని, నష్టపరిహారం అందించి న్యాయం చేయాలని రైతు డిమాండ్ చేశాడు.

# సర్కారు బడులకు కార్పొరేట్ చేయూత!

- విద్యాశాఖతో మూడు సంస్థల కీలక ఒప్పందాలు
- రాంకీ, రహేజా, యశోద సంస్థల భారీ నిధులు
- జవహర్ నగర్, తుక్కుగూడ స్కూళ్ల ఆధునీకరణ
- కొండాపూర్, ఉప్పల్ బడులలో వసతుల కల్పన
- కార్పొరేట్ ల సేవలను అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, మే 23 (మనసులో మాట ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా వసతుల కల్పన కోసం, విద్యాభివృద్ధి కోసం కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులు కేటాయించేందుకు ముందుకు వచ్చిన రహేజా గ్రూప్, రామ్ కీ ఫౌండేషన్, యశోద ఫౌండేషన్ సంస్థలను ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అభినందించారు. శనివారం ముఖ్యమంత్రి సమక్షంలో ఆయా సంస్థల అధినేతలు విద్యాశాఖతో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఈ ఒప్పంద పత్రాలను రహేజా గ్రూప్ అధ్యక్షుడు నీల్ సి. రహేజా, రామ్ కీ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ అల్లా దాక్షాయణి, యశోద గ్రూప్ డైరెక్టర్ గోరుకంటి దేవేందర్ రావు ముఖ్యమంత్రికి అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ, నూతన తరగతి గదుల నిర్మాణం కోసం ఆయా సంస్థలు భారీగా నిధులను వెచ్చించనున్నాయి.

**రాంకీ సంస్థ:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జవహర్ నగర్ లో ప్రీ ప్రైమరీ నుండి ఇంటర్ వరకు తరగతుల కొత్త ప్రాంగణ నిర్మాణానికి మొత్తం ఖర్చులో 40 శాతం అంటే రూ.19.66 కోట్లు ఖర్చు చేయనుంది. అలాగే రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్) ఆధునీకరణలో భాగంగా కొత్త తరగతుల నిర్మాణం కోసం 40 శాతం అంటే రూ.10.4 కోట్లు భరించనుంది.

**రహేజా గ్రూప్:** రంగారెడ్డి జిల్లా కొండాపూర్ లో ప్రీ ప్రైమరీ నుండి ఇంటర్ వరకు తరగతుల కోసం అవసరమైన రూ.50.50 కోట్లను పూర్తిగా భరించనుంది.

**యశోద హాస్పిటల్స్:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ సుభాష్ నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్) లో ప్రీ ప్రైమరీ, 6, 7 తరగతుల కోసం అవసరమైన రూ.12.20 కోట్లను కేటాయించింది.

**అభినందించిన అధికారులు**

ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ దేవసేన, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ చైర్మన్ సి. శేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చేందుకు కార్పొరేట్ సంస్థలు ఈ విధంగా తమ వంతు సహాయం అందించడం గొప్ప విషయమని అధికారులు కొనియాడారు.

# కాన్వాయ్‌ను కుదించిన సీఎం రేవంత్!

**మూడు కార్లతోనే సచివాలయానికి రాక**

**భారీ భద్రత, జామర్లు లేకుండా ప్రయాణం**



**హైదరాబాద్, మే 23 (మనసులో మాట ప్రతినిధి):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నెలకొల్పిన ఆదర్శాన్ని అనుసరిస్తూ తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శనివారం తన కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను తగ్గించారు. ఎటువంటి భారీ భద్రత, జామర్లు లేకుండా కేవలం మూడు కార్లతోనే ఆయన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో జరగనున్న మంత్రివర్గ సమావేశానికి హాజరయ్యారు. మే 10న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన బహిరంగ సభలో ప్రధానమంత్రి సూచించిన పొదుపు చర్యలను పలువురు ప్రముఖులు పాటిస్తున్నారు. ఇందులో భాగంగానే గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా కూడా మే 14న తన కాన్వాయ్ వాహనాల సంఖ్యను సగానికి తగ్గించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు కూడా తన కాన్వాయ్ పరిమాణాన్ని 11 వాహనాల నుండి నాలుగుకు తగ్గించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తన కాన్వాయ్‌ను 50 శాతం కుదించగా, ఐటీ మంత్రి నారా లోకేష్ కూడా ఇదే విధానాన్ని అనుసరించడం విశేషం. మధ్యప్రాచ్యంలో అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధ వాతావరణం కారణంగా చమురు వాణిజ్యానికి, సరఫరా మార్గాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రస్తుత తరుణంలో ప్రజలందరూ ఇంధనాన్ని పొదుపు చేసేలా ప్రోత్సహించడమే ప్రధానమంత్రి ఇచ్చిన ఈ పిలుపు వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశం.

# అక్రమంగా ఓట్లు తొలగిస్తే అడ్డుకుంటాం!

**పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ హెచ్చరిక**

**పశ్చిమ బెంగాల్‌లో ఓట్ల అక్రమాలపై మండిపాటు**

**ధాన్యం దిగుబడి పెరగడం వల్లే కొనుగోళ్లలో జాప్యం**

**నా పనితీరును అధిష్ఠానమే బేరీజు వేస్తుంది**

**పీసీసీ మార్పుపై ఏఐసీసీదే తుది నిర్ణయం**

**హైదరాబాద్, మే 23 (మనసులో మాట ప్రతినిధి):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఎస్ఆర్) పేరిట అక్రమంగా ఓట్లను తొలగించాలని చూస్తే ఊరుకునేది లేదని, ఖచ్చితంగా అడ్డుకుంటామని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ఓట్ల అక్రమాలను ఆయన ఈ సందర్భంగా ఉదాహరణగా పేర్కొన్నారు. అక్కడ ఏకంగా 31 లక్షల ఓట్లను చేర్చి, 93 లక్షల ఓట్లను తొలగించారని ఆరోపించారు. ఇటీవల ఆ రాష్ట్రంలో టీఎంసీ కేవలం 30 లక్షల ఓట్ల తేడాతోనే ఓడిపోయిందని గుర్తుచేశారు.



తెలంగాణలో ఈసారి ధాన్యం దిగుబడి ఊహించిన దానికంటే చాలా ఎక్కువగా పెరిగిందని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ కారణంగానే ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో కొంత జాప్యం జరిగిందని వివరించారు. రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని, ప్రతి గింజా కొనుగోలు చేస్తామని చెప్పారు. తన పనితీరును ఏఐసీసీ లేదా ముఖ్యమంత్రి బేరీజు వేస్తారని ఆయన పేర్కొన్నారు. పీసీసీ మార్పులకు సంబంధించిన అంశాల్లో ఏఐసీసీ నిర్ణయమే తుది నిర్ణయమని స్పష్టం చేశారు. ఏఐసీసీ దృష్టిలో తెలంగాణ పీసీసీ అత్యుత్తమంగా పనిచేస్తోందని పార్టీ అగ్రనేత కేసీ వేణుగోపాల్ గతంలోనే అభినందించిన విషయాన్ని ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ గుర్తుచేశారు.

# అభివృద్ధిలో మంత్రి వెంకటరెడ్డి పాత్ర కీలకం!

- పవన్ మోటార్స్‌లో ఘనంగా జన్మదిన వేడుకలు
- మారుతి సుజుకి షోరూమ్‌లో కేక్ కట్ చేసిన సిబ్బంది
- నల్లగొండ ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్ష
- కొనియాడిన పవన్ మోటార్స్ ఎండీ చంద్ర పవన్ రెడ్డి



**నల్లగొండ, మే 23 (మనసులో మాట ప్రతినిధి):** నల్లగొండ పట్టణంలోని పవన్ మోటార్స్ మారుతి సుజుకి షోరూమ్‌లో తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పవన్ మోటార్స్ మేనేజింగ్ డైరెక్టర్ కోమటిరెడ్డి చంద్ర పవన్ రెడ్డి ఆధ్వర్యంలో, సీసీఓ రవిరెడ్డి, జీఎం నాగమణి సుధాకర్ సమన్వయంతో నిర్వహించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి చంద్ర పవన్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో మంత్రి వెంకటరెడ్డి కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల నివారణకు నాణ్యమైన రహదారుల నిర్మాణం చేపట్టి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందిస్తున్నారని కొనియాడారు.

## ప్రజలకు మరిన్ని సేవలు

నల్లగొండ ప్రజలకు మంత్రి మరిన్ని సేవలు అందిస్తూ ఇంకా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పవన్ మోటార్స్ ఉద్యోగులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# బక్రీద్ సెలవు 28కి మార్పు!

**హైదరాబాద్, మే 23 (మనసులో మాట ప్రతినిధి):** తెలుగు రాష్ట్రాల్లో బక్రీద్ (ఈద్ ఉల్ అజ్ హా) పండుగ ప్రభుత్వ సెలవు దినం మారింది. దుల్ హిజ్జా నెలవంక దర్శనం ఒక రోజు ఆలస్యం కావడంతో మే 28న బక్రీద్ సెలవు దినంగా ప్రకటిస్తూ ప్రభుత్వాలు ఉత్తర్వులు జారీ చేశాయి. దీంతో ఆ రోజున అన్ని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు విద్యాసంస్థలు, బ్యాంకులకు సెలవు ఉండనుంది. అయితే చంద్రదర్శనం ఆధారంగా సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) వంటి గల్ఫ్ దేశాల్లో మాత్రం ఈ నెల 27న (బుధవారం) పండుగ జరుపుకోనున్నారు. తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మే 27న సెలవు ఉండాల్సి ఉంది. దానిని మే 28 గురువారానికి మారుస్తూ రెండు తెలుగు రాష్ట్రాలు అధికారిక ఉత్తర్వులు ఇచ్చాయి. ముస్లింలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే పవిత్రమైన బక్రీద్ పండుగ ఇస్లామిక్ క్యాలెండర్‌లోని చివరి నెల అయిన దుల్ హిజ్జా 10వ రోజున వస్తుంది. ముస్లిం పండుగలు చంద్రదర్శనంపై ఆధారపడి ఉంటాయి. ఈసారి నెలవంక ఆలస్యంగా కనిపించడంతో పండుగ తేదీ మారినట్లు మత పెద్దలు ప్రకటించారు.

# జూనియర్ కాలేజీల్లోనూ మధ్యాహ్న భోజనం!

- గోదావరి పుష్కరాలకు వెయ్యి కోట్ల నిధులు
- పేదలకు లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
- ఐదేళ్లలో ఐదు లక్షల ఉద్యోగాలే లక్ష్యం
- కరీంనగర్‌లో సాయుధ బలగాల కేంద్రాలు
- కేబినెట్ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




**హైదరాబాద్, మే 23 (మనసులో మాట ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో శనివారం సుదీర్ఘంగా జరిగింది. ఈ సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాలను రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం రాత్రి మీడియాకు వివరించారు. విద్యార్థులు, నిరుద్యోగులు, భక్తులు, పేదలకు ఎంతో మేలు చేకూర్చేలా కేబినెట్ పలు చారిత్రాత్మక తీర్మానాలు చేసింది.

## జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం

రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇకపై ప్రతిరోజూ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపారు. పాఠశాలలతో సమానంగా జూనియర్ కాలేజీల్లో చదివే విద్యార్థులకు సైతం ప్రతిరోజూ ఉదయం అల్పాహారంతో పాటు పాలు అందించాలని నిర్ణయించారు.

## గోదావరి పుష్కరాలకు రూ.1000 కోట్లు

వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జులై 7వ తేదీ వరకు జరగనున్న గోదావరి పుష్కరాల పనుల కోసం రూ.1000 కోట్ల నిధులకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో తొలి విడతగా రూ.300 కోట్లు మంజూరు చేయనున్నారు.

## కరీంనగర్‌లో సాయుధ బలగాల కేంద్రాలు

కరీంనగర్ జిల్లాలో అస్సాం రైఫిల్స్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్ గ్రూప్ సెంటర్ల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందుకోసం మానుకొండూరు మండలం వెలిదిలో 14 ఎకరాలు, చొప్పదండి మండలం రుక్మాపూర్‌లో 5 ఎకరాలు, గన్నేరువరం మండలంలో 5 ఎకరాల భూమిని కేటాయించారు. అలాగే గంగాధర డిగ్రీ కాలేజీకి 29 పోస్టులు, కేసముద్రం ఫైర్ స్టేషన్‌కు 18 పోస్టులను మంజూరు చేశారు.

## అసంపూర్తి ఇందిరమ్మ ఇళ్లకు నిధులు

ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభమై గోడలు, శ్లాబు దశలో నిలిచిపోయిన అసంపూర్తి ఇళ్లను పూర్తి చేయాలని కేబినెట్ నిర్ణయించింది. పునాదులు పూర్తయి గోడలు లేని ఇళ్లకు రూ.3 లక్షలు, గోడలు పూర్తయి శ్లాబు నిలిచిపోయిన ఇళ్లకు రూ.2 లక్షల చొప్పున అందిస్తారు. ఇందుకోసం నియోజకవర్గానికి 500 ఇళ్ల చొప్పున నిధులు కేటాయిస్తారు.

## జూన్ 2న లక్ష ఇళ్ల గృహప్రవేశాలు

తొలి విడతలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లలో జూన్ 2 నాటికి దాదాపు లక్ష ఇళ్ల గృహప్రవేశాలు జరుగుతాయి. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం కొఠారి గ్రామంలో కొలాం ఆదివాసీల కోసం ప్రభుత్వం నిర్మించిన 28 ఇళ్లను జూన్ 1న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రుల బృందం ప్రారంభిస్తుంది. ఇందిరమ్మ కుటుంబ బీమా, కొత్త పింఛన్ల పంపిణీపైనా సమావేశంలో చర్చించారు.

## గుడిసెలు లేని రాష్ట్రంగా తెలంగాణ

హైదరాబాద్ మహానగరం పరిధిలోని 24 నియోజకవర్గాల్లో అల్పాదాయ వర్గాల కోసం లక్ష ఎల్ఐజీ ఇళ్ల నిర్మాణానికి కేబినెట్ నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా సర్వేల ప్రకారం గుర్తించిన 15 వేల గుడిసెల కుటుంబాలన్నింటికీ వెంటనే ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందిస్తారు. గుడిసెలు లేని ఆదర్శ రాష్ట్రంగా తెలంగాణను నిలపడమే ప్రభుత్వ సంకల్పం.

## విలీనాలు, వివిధ ప్రాజెక్టుల ఆమోదం

రాష్ట్రంలోని డీసీఎంఎస్‌లను మార్క్‌ఫెడ్‌లో విలీనం చేయాలని, టీజీఆర్ఐసీని హాకాలో విలీనం చేయాలని కేబినెట్ నిర్ణయించింది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం భూసేకరణ, పునరావాసం, మౌలిక వసతుల కల్పనకు రూ.587 కోట్లు కేటాయించారు. విద్యుత్ పంపిణీ, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్రం అమలు చేస్తున్న ఆర్‌డీఎస్ఎస్ పథకంలో చేరేందుకు డిస్కంల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు.

## నెక్స్ట్ జనరేషన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026ఉ30

తెలంగాణను 2030 నాటికి ప్రపంచంలోని టాప్ 5 లైఫ్ సైన్సెస్ హబ్‌లలో ఒకటిగా నిలబెట్టేందుకు నూతన పాలసీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. దావోస్‌లో ఆవిష్కరించిన ఈ పాలసీ ద్వారా వచ్చే ఐదేళ్లలో 25 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించి, 5 లక్షల ఉద్యోగాల కల్పనను లక్ష్యంగా పెట్టుకున్నారు. లైఫ్ సైన్సెస్, ఫార్మా, బయోటెక్, మెడికల్ ఇన్నోవేషన్ రంగాల్లో భారీ పెట్టుబడులకు తెలంగాణను గమ్యస్థానంగా మారుస్తారు. ఇప్పటివరకు తయారీ మీద దృష్టి ఉంటే, ఇకపై విలువైన ఇన్నోవేషన్ మీద ఎక్కువ ఫోకస్ పెడతారు. పరిశోధన, అభివృద్ధి విభాగాలను కూడా పరిశ్రమలుగా గుర్తిస్తారు. దీనివల్ల గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు, గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్లు తెలంగాణకు రావడానికి మార్గం సుగమం అవుతుంది.

# ఉద్యోగాల పేరిట లక్షల్లో వసూళ్లు!

**టెక్నోరైజ్ సంస్థ సీఈఓ లక్ష్మీకాంత్‌పై కేసు**

**ట్రైనింగ్ పేరుతో నిరుద్యోగులకు వల**

**మహిళా ఉద్యోగినిపై వేధింపులు, బెదిరింపులు**

**హైదరాబాద్, మే 23 (మనసులో మాట ప్రతినిధి):** ఉద్యోగాలు ఇప్పిస్తామనే పేరుతో అభ్యర్థుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసిన టెక్నోరైజ్ సంస్థ సీఈఓ లక్ష్మీకాంత్ గౌడ్ పైన పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ట్రైనింగ్ ఇస్తామంటూ ఒక్కొక్కరి వద్ద నుంచి రూ. 50 వేల నుండి రూ. 1.5 లక్షల వరకు వసూలు చేసినట్లు ఆయనపై ఆరోపణలు వచ్చాయి. ఈ ఏడాది మార్చి నెలలో సదరు సంస్థ సుమారు 80 నుండి 90 మంది ఉద్యోగులను నియమించుకుంది. అయితే వారికి జీతాలు ఇవ్వకుండా లక్ష్మీకాంత్ వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. ఆఫీస్ అద్దె కూడా చెల్లించకపోవడంతో గత నెల 25వ తేదీన కార్యాలయానికి యజమాని తాళం వేశారు. బకాయి ఉన్న జీతాల గురించి ప్రశ్నించిన ఒక మహిళా ఉద్యోగినిని సీఈఓ దూషించడమే కాకుండా, బెదిరింపులకు గురిచేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాధిత మహిళా ఉద్యోగినిపై క్లబ్బులు, పబ్బులకు రావాలంటూ లక్ష్మీకాంత్ తీవ్ర ఒత్తిడి తెచ్చినట్లు పోలీసుల ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతటితో ఆగకుండా, పెండింగ్‌లో ఉన్న జీతాలు ఇవ్వాలంటే ఒక్కొక్కరు రూ. 5 వేలు చెల్లించాలని డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు లక్ష్మీకాంత్ గౌడ్‌పై బెదిరింపులు, వేధింపులు, మోసం తదితర సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు.

# పర్సంటేజీ ఇస్తేనే సినిమా ఆడిస్తాం!

**ఎగ్జిబిటర్ల అసోసియేషన్ కీలక నిర్ణయం**

**హైదరాబాద్, మే 23 (మనసులో మాట ప్రతినిధి):** తెలంగాణ ఎగ్జిబిటర్ల అసోసియేషన్ ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై తమ థియేటర్లలో పెద్ద సినిమాలు విడుదల చేయాలంటే ఖచ్చితంగా తమకు పర్సంటేజీ ఇవ్వాల్సిందేనని స్పష్టం చేసింది. ఏ సినిమాకైనా పర్సంటేజీ విధానమే వర్తిస్తుందని అసోసియేషన్ సభ్యులు శనివారం మీడియా సమావేశంలో తేల్చి చెప్పారు. తెలుగు ఫిల్మ్ చాంబర్ కమిటీతో ఇప్పటికే రెండు, మూడు సార్లు చర్చలు జరిగాయని ఎగ్జిబిటర్లు తెలిపారు. 'హరిహర వీరమల్లు' సినిమా విడుదల సమయంలో, రెండు నెలల్లో తమ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, కానీ ఏడాది గడిచినా ఎలాంటి పురోగతి లేదని మండిపడ్డారు. పెద్ద సినిమాలకు తమకు పర్సంటేజీ ఇవ్వాల్సిందేనని, నిర్మాతలు కావాలనే తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. మొదట మూడు వారాల అన్న నిబంధనను ఇప్పుడు ఆరు వారాలకు పెంచారని, పర్సంటేజీ సిస్టమ్ అయితేనే సినిమాలు ఆడిస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుతం 120 మంది థియేటర్ల యజమానులు అత్యంత దీనస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**రెంటల్ మాట వద్దు.. పర్సంటేజీ ముద్దు**

పదేళ్ల కిందట థియేటర్లకు మంచి ఆదాయం ఉండేదని, ఇప్పుడు ఎగ్జిబిటర్లకు పైసా రావడం లేదని, కానీ నిర్మాతలకు మాత్రం 14 రకాలుగా ఆదాయం వస్తోందని గుర్తుచేశారు. పర్సంటేజీ విధానం అనేది కొత్తది కాదని, అన్ని రాష్ట్రాల్లో ఇప్పటికే అమలులో ఉందని పేర్కొన్నారు. చాంబర్ ప్రతినిధులు కూర్చుని పర్సంటేజీని తేల్చాలని, అప్పుడే అన్ని సినిమాల విడుదల సాఫీగా జరుగుతుందని చెప్పారు. పర్సంటేజీ ఒప్పందంపై సంతకం చేస్తేనే పెద్ద సినిమాల విడుదలకు ఒప్పుకుంటామని తేల్చి చెప్పారు. మెగాస్టార్ చిరంజీవి పెద్దమనిషిగా పిలిస్తే వెళ్లి తమ బాధలు చెప్పుకుంటామని, అయితే తమకు మాత్రం పర్సంటేజీ సిస్టమే కావాలని, రెంటల్ పద్ధతి వద్దని ఎగ్జిబిటర్ల అసోసియేషన్ స్పష్టం చేసింది.

# నీటి కోసం మళ్లీ లైన్లు కట్టే పరిస్థితి

- జలమండలి కార్యాలయం వద్ద బీఆర్ఎస్ ధర్నా
- హైదరాబాద్ లో తీవ్రమైన తాగునీటి సమస్యలు
- సమస్యలు తీర్చకుంటే పెద్ద ఎత్తున నిరసనలు
- ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



**ఎల్బీనగర్, మే 23 (మనసులో మాట ప్రతినిధి):** జంట నగరాల్లో నెలకొన్న తాగునీటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఖైరతాబాద్ జలమండలి కార్యాలయంలో ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ పరిపాలన చేతకాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలను ఇబ్బందులు పెడుతున్నాడని విమర్శించారు. మళ్లీ హైదరాబాద్ ప్రజలు నీటి కోసం లైన్లు కట్టి, బిందెలతో పోట్లాడుకునే పరిస్థితి తీసుకువచ్చాడని, ప్రజా పాలన పేరుతో ప్రజలను కష్టపెడుతున్నాడని అన్నారు. తాగునీటి సరఫరాలో నెలకొన్న ఇబ్బందులను వెంటనే పరిష్కరించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**పైపులైన్ల ద్వారా సరఫరా లేదు**

ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలో దాదాపు రెండు నెలల నుంచి మంచినీటి సమస్య ఉన్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నగరానికి 750 ఎంజీడీల నీరు అవసరముంటే కేవలం 550 ఎంజీడీలు మాత్రమే సరఫరా చేస్తున్నారన్నారు. రోజుకు 12 వేల ట్యాంకర్ల ద్వారా నీరు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ఈ ప్రభుత్వం, పైపులైన్ల ద్వారా సరఫరా చేయడం లేదని స్పష్టంగా అర్థమవుతుందన్నారు. మంచినీటి సరఫరా విషయంలో అధికారులు చొరవ తీసుకోకపోతే మరింత పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, సీనియర్ భారస నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏపీకి ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యం!

**రాహుల్ ప్రధాని అయితేనే రాష్ట్రానికి లబ్ధి**

**రాజ్యాంగాన్ని రద్దు చేసే కుట్రలో బీజేపీ**

**కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**

**హైదరాబాద్, మే 23 (మనసులో మాట ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితేనే ఏపీకి ప్రత్యేక హోదా వస్తుందని స్పష్టం చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసమైనా రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని ఏపీ ప్రజలకు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందని జగ్గారెడ్డి ఆరోపించారు. దేశ ప్రజలకు రాజ్యాంగం ఒక రక్షణ కవచం లాంటిదని పేర్కొన్నారు. కవచ కుండలాలు ఉన్నంత కాలం కర్ణుడిని ఎవరూ ఏమీ చేయలేకపోయారని, వాటిని దానం చేశాకే ఆయన ప్రాణాలు పోయాయని గుర్తుచేశారు. రాజ్యాంగ పరిరక్షణ కోసమే రాహుల్ గాంధీ నిరంతరం శ్రమిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారని చెప్పారు. రాహుల్ కుటుంబం దేశం కోసం ఆస్తులను, ప్రాణాలను త్యాగం చేసిందని, ఆయన ఎన్నడూ అధికారం కోసం తాపత్రయపడలేదని కొనియాడారు. 67 ఏళ్ల దేశ పాలనలో రూ. 54 లక్షల కోట్ల అప్పులు ఉంటే, బీజేపీ అధికారంలోకి వచ్చాక ఏకంగా రూ. 1,047 లక్షల కోట్ల అప్పులు చేసిందని మండిపడ్డారు.తాను రియల్ ఎస్టేట్‌లో సంపాదించిన డబ్బుతో సీతారాముల కల్యాణం జరిపిస్తానని, తనది నిజమైన భక్తి అని జగ్గారెడ్డి చెప్పారు. తెలంగాణలో ఏ ఒక్క బీజేపీ నేత అయినా తనలా స్వంత డబ్బుతో కల్యాణం జరిపించగలరా అని నిలదీశారు. రాముడి కల్యాణం చేసి తాను ఎప్పుడూ ఓట్లు అడగలేదన్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ కాలంలో ముస్లింలు మంత్రులుగా పనిచేశారని, ఆయనకు లేని మతపిచ్చి బీజేపీ నేతలకు ఎందుకని ప్రశ్నించారు. దేవుడి పేరుతో, మతం పేరుతో, దొంగ ఓట్లతో బీజేపీ గెలుస్తోందని ఆరోపించారు. ఎలక్షన్ కమిషన్ ద్వారా ఓట్లను దొంగిలించి ఎంపీ సీట్లను గెలుచుకుందని, దేశ ప్రజలు ఇప్పటికే ప్రమాదంలో ఉన్నారని జగ్గారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

# నిజాలు లేని పొంగులేటి ఆరోపణలు!

**రియల్ మాఫియా చేతుల్లో మంత్రి**

**ఫ్యూచర్ సిటీ అక్రమాలకు అడ్డా అన్న దాసోజు**

**హైదరాబాద్, మే 23 (మనసులో మాట ప్రతినిధి):** బీఆర్ఎస్ పార్టీ అగ్రనాయకత్వంపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేసిన అహంకారపూరిత, అవగాహన లేని వ్యాఖ్యలపై బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ ఉద్యమ చరిత్ర కానీ, ఇక్కడి ప్రగతి ప్రస్థానం కానీ తెలియని పొంగులేటి.. ఒక బాధ్యతాయుతమైన మంత్రి పదవిలో ఉండి నిస్సిగ్గుగా, చిల్లర జ్యోతిష్యాలు చెప్పడం హాస్యాస్పదమని మండిపడ్డారు. తమ పొలిటికల్ ఫ్యూచర్ గురించి మాట్లాడే నైతిక అర్హత ఆయనకు ఎక్కడిదని నిలదీశారు. మంత్రి పొంగులేటి భవిష్యత్తు ఏంటో ఆయనకే తెలుసని, త్వరలోనే ఆయన అవినీతి లీలలన్నీ బట్టబయలై జైలు ఊచలు లెక్కబెట్టడం ఖాయమని దాసోజు శ్రవణ్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన తాత్కాలిక అవినీతి సామ్రాజ్యాన్ని బద్దలు కొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. మంత్రి చేస్తున్న అక్రమాలు, వెనకుండి నడిపిస్తున్న రియల్ ఎస్టేట్ మాఫియా దందాల వల్ల మరో రెండేళ్లు దాటితే ఆయన చర్లపల్లి జైల్లోనే ఉంటారని హెచ్చరించారు. పదేళ్లలో ఒక్క మెట్రో స్టేషన్ కూడా కట్టలేదని బీఆర్ఎస్ పై విమర్శలు చేయడానికి సిగ్గుండాలని మండిపడ్డారు. అధికార అహంకారంతో కళ్లు మూసుకుపోయాయా అని పొంగులేటిని దాసోజు శ్రవణ్ ప్రశ్నించారు. హైదరాబాద్ నగరానికి అంతర్జాతీయ స్థాయి మెట్రో ప్రాజెక్టును తెచ్చి, రికార్డు సమయంలో మొదటి దశ పూర్తి చేసి చూపించింది నాటి కేసీఆర్ ప్రభుత్వమేనని గుర్తుచేశారు. హైటెక్ సిటీ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వరకు మెట్రో రెండో దశకు సంబంధించిన అన్ని ప్రణాళికలు, రూట్ మ్యాప్‌లను సిద్ధం చేస్తే.. ఈరోజు అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం వాటిని రద్దు చేసింది నిజం కాదా అని నిలదీశారు.ఇది ఫ్యూచర్ సిటీ కాదు.. ఒక 'ఫేక్' సిటీ అని, ల్యాండ్ మాఫియాకు అడ్డా అని దాసోజు శ్రవణ్ దుయ్యబట్టారు. ప్రపంచ దేశాలు మెచ్చేలా, ఉపాధి కల్పనే ధ్యేయంగా నాడు కేసీఆర్ తెచ్చిన గ్రీన్ ఫీల్డ్ ఫార్మా సిటీని రద్దు చేసి.. ఈరోజు ఫ్యూచర్ సిటీ అనే రంగుల ప్రపంచం పేరుతో ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం పేద ప్రజలు, గిరిజనులు, రైతుల నోళ్లు కొట్టి వారి భూములను అక్రమంగా లాక్కోవడమే ఫ్యూచర్ సిటీ వ్యూహమా అని నిలదీశారు.